ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
ఆదివారం 11 ఫిబ్రవరి 2024



రైతు మోములో.. చిరునవ్వు!

రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్ద పీట

- సాగు చేయని భూములకు రైతు భరోసా కట్
- ఉమ్మడి జిల్లాలో 30శాతం తగ్గనున్న భారం
- కౌలు రైతులకు ప్రయోజనం
- శివార్లన్నీ అర్బన్, పెరి అర్బన్, గ్రామీణ జోన్‌లుగా విభజన
- ఫార్మాసిటీ కాదు.. ఇక ఫార్మా క్లస్టర్లే

రాష్ట్ర ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రకారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని రైతులకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలగనుంది. జిల్లాలో పది లక్షల మందికి పైగా రైతులు ప్రభుత్వ పథకాలను అందుకోనున్నారు. దాదాపు రైతులతో సమానంగా ఉన్న కౌలు రైతులకు కూడా ప్రయోజనం కలిగించేలా బడ్జెట్ ఉందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. వ్యవసాయానికి పెద్దపీట వేయడంతో జిల్లా వాసులకు ప్రయోజనం కలిగించే పాలమూరు-రంగారెడ్డి, చేవెళ్ల- ప్రాణహిత ప్రాజెక్టులకు కూడా భారీగా నిధులు వస్తాయన్న ఆశతో రైతులున్నారు. కాకుంటే ప్రాజెక్టుల వారీగా నిధులు కేటాయింపు విషయాన్ని ప్రభుత్వం వెల్లడించలేదు.







కౌలు రైతులకు ప్రయోజనం

ఎకరాకు రూ. 15వేలు రైతు భరోసా ఇవ్వడంతో పాటు కౌలు రైతులకు కూడా దీన్ని వర్తింపచేయాలని నిర్ణయించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో వేలాదిమంది కౌలు రైతులకు ప్రయోజనం కలగనుంది. ఎన్నికల హామీల్లో భాగంగా రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. రైతుల కోసం కొత్త విత్తన విధానాన్ని అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో రైతులు పది లక్షల మందికి పైగా ఉన్నారు. వీరిలో వ్యవసాయం చేసే వారికి మాత్రమే రైతుబంధు అందనుంది.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

కొత్తగా అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ సర్కార్ ఆడంబరాలకు పోకుండా సంక్షేమ బాట పట్టింది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క శనివారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా ఆరు గ్యారెంటీ స్కీమ్‌లకు నిధులు కేటాయించారు. మహిళలు, రైతులతో పాటు వివిధ అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాల కింద భారీగా నిధులు కేటాయించారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని ప్రజలకు ఎంతో ప్రయోజనం కలగనుంది. ఈ పథకాల కింద మరింత మంది లబ్ధిదారులు ప్రభుత్వ సాయం అందుకోనున్నారు. అదేవిధంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ, గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల కింద మరింత ప్రయోజనం చేకూరనుంది.

30 శాతం భూములకు రైతు భరోసా కట్!



రైతు భరోసా విషయంలో సర్కార్ తాజాగా తీసుకున్న నిర్ణయం ప్రకారం వ్యవసాయం చేయని భూములకు రైతు భరోసా కట్‌కానుంది. రైతుబంధు పథకం కింద గత సర్కార్ ఎకరానికి రూ. 12వేలు ఇస్తుండగా కాంగ్రెస్ పార్టీ రూ. 15వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. తాజాగా ప్రకటించిన బడ్జెట్‌లో కూడా రైతు భరోసా విషయాన్ని ప్రస్తావించారు. అయితే అర్హులైన రైతులకే రైతుబంధు అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో రైతు భరోసా నిధుల భారం ప్రభుత్వానికి భారీగా తగ్గనుంది. ఇందులో ఉమ్మడి జిల్లా నుంచే ఎక్కువ మందికి రైతు భరోసా కట్ కానుంది. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో దాదాపు 30శాతానికి పైగా భూములకు రైతు భరోసా నిలిచిపోనుంది. హైదరాబాద్ చుట్టు పక్కల వేలాది ఎకరాల్లో రియల్ ఎస్టేట్ విస్తరించిన సంగతి తెలిసిందే. 20 ఏళ్ల కిందట లే అవుట్లకు కూడా ఇపుడు రైతుబంధు ఇస్తున్నారు. అలాగే జాతీయ రహదారులకు కేటాయించిన భూములకు కూడా తిరిగి రైతు బంధు ఇస్తున్న విషయాన్ని ఇటీవల ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ఎప్పుడో అమ్మేసిన భూములకు సంబంధించిన రికార్డులు మారకపోవడంతో ధరణీలో పాత రైతుల పేర్లే వస్తున్నాయి. కానీ ఇందులో లే అవుట్లు వచ్చి ఇళ్లు కూడా నిర్మించారు. ఇలాంటి వారందరికీ రైతుబంధు వస్తుంది.. కాంగ్రెస్ సర్కార్ ఇలాంటి వారికి పెట్టుబడి సహాయం పూర్తిగా నిలిపి వేయాలని నిర్ణయించింది.



పేద తరగతి విద్యార్థులకు ఊరట

ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు పథకాల్లో నిధులు పెంచారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలకు భారీగా నిధులు కేటాయించారు. ప్రతీ మండలానికి ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఆ మేర చర్యలు తీసుకుంది. పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు రూ. 500 కోట్ల నిధులు కేటాయించింది. దీంతో ప్రతి మండలంలో అన్ని సౌకర్యాలతో పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కానుంది. అదేవిధంగా మూసీ నది ప్రక్షాళన కోసం రూ.1000 కోట్లు నిధులు విడుదల చేయడంతో మూసీ పరివాహక ప్రాంతంలో సుందరీకరణ పనులు జోరుగా సాగుతాయి. అలాగే రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్శిటీతో పాటు ఇతర యూనివర్శిటీలకు భారీగా నిధులు కేటాయించారు. నిరుద్యోగులు ఎదురుచూస్తున్న డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుళ్ల రాత పరీక్షలు కూడా సకాలంలో నిర్వహిస్తామని తెలిపారు.



ప్రాజెక్టుల వారీగా నిధుల కేటాయింపుపై స్పష్టత కరువు

నీటిపారుదల ప్రాజెక్టులకు రూ. 28వేల కోట్లు కేటాయించినప్పటికీ ఓట్ ఆన్ అకౌంట్ వల్ల ఏఏ ప్రాజెక్టులకు ఎన్నెన్ని నిధులు అనే దానిపై స్పష్టత రాలేదు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వాసులు ఎంతో కాలంగా పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు కోసం ఎదురు చూస్తున్న సంగతి తెలిసిందే. అయితే మళ్లీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ చేవెళ్ల- ప్రాణహిత ప్రాజెక్టు విషయంలో ముందుకు వెళతామని ఇంతకు ముందు ప్రకటించింది. దీంతో ఈ రెండు ప్రాజెక్టులపై ఉమ్మడి జిల్లా వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



ఫార్మాసిటీ కాదు.. ఫార్మా క్లస్టర్లే

తాజా బడ్జెట్‌లో ఫార్మాసిటీ ఊసే లేదు. అయితే ఫార్మాసిటీకి బదులు ఫార్మ క్లస్టర్ల ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దీంతో నగర శివార్లలో కొన్ని ఫార్మా క్లస్టర్లు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. అలాగే నగర శివారు ప్రాంతాలను మూడు జోన్‌లుగా విభజించి అభివృద్ధి చేయనున్నారు. ఇందులో రింగురోడ్డు లోపలి భాగాన్ని అర్బన్ జోన్‌గా, రింగ ఎరోడ్డు, రీజినల్ రింగు రోడ్డు మధ్య భాగాన్ని పెరి అర్బన్‌గా, రీజినల్ రింగురోడ్డు బయట రూరల్ జోన్‌గా విభజించనున్నారు. దీంతో రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల పరిధిలోని పలు గ్రామాలు పెరిఅర్బన్ పరిధిలోకి రానున్నాయి. ధరణి పోర్టల్‌ను ప్రక్షాళన చేస్తామన్నారు. ధరణి ఏర్పాటు చేయడం వల్ల తమ భూములు తమ పేరుమీద లేకుండా పోయాయని, ఇందులో అనేక అవకతవకలు జరిగాయని ఉమ్మడి జిల్లాలోని అనేకమంది రైతులు ఆందోళనలకు కూడా దిగారు. ఇప్పుడు ధరణి పోర్టల్‌ను ప్రక్షాళన చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీనిని ప్రక్షాళన చేస్తే ఉమ్మడి జిల్లాలోని దీర్ఘకాలిక భూ సమస్యలకు కొత్త పరిష్కార మార్గాలు దొరికే అవకాశం ఉంది.



ఎవరేమన్నారంటే..

విద్యారంగానికి స్వల్ప ఊరట



రంగారెడ్డి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.21,389 కోట్లు కేటాయించడం హర్షణీయం. గతం కంటే కేటాయింపులు పెరిగినా కాంగ్రెస్ మానిఫెస్టోలో పేర్కొన్నట్లుగా 15శాతం కేటాయించలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల విద్యాలయాల భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించటం సంతోషకరం. మెగా డీఎస్సీ నిర్వహిస్తామని, పాఠశాలల్లో వసతులకు చర్యలు తీసుకుంటామని ప్రకటించడం ఆహ్వానించ తగ్గ పరిణామం. ప్రతీ మండలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు రూ.500కోట్లు కేటాయింపు శుభపరిణామం.

- ఏవీ.సుధాకర్, ఎస్టీయుటీఎస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి

వాస్తవానికి దూరంగా బడ్జెట్



తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ వాస్తవానికి దూరంగా ఉంది. ఎన్నికల ముందు ప్రజలను ఆకర్షించడానికి ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలు ప్రశ్నార్థకంగా మారింది. బడ్జెట్‌లో నిరుద్యోగ భృతిని ప్రస్తావించకుండా నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసింది. రైతులకు రుణమాఫీ కేటాయించిన బడ్జెట్ సరిపోయేదిగా లేదు. ఆరు గ్యారంటీలకు బడ్జెట్ నిధులు సరిపోవు.

- మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, వికారాబాద్

మూసీ అభివృద్ధికి నిధులు కేటాయింపు అభినందనీయం



మూసీనది అభివృద్ధికి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.వేయికోట్లు కేటాయించడం అభినందనీయం. గత ప్రభుత్వ హయంలో మూసీనది మురికికూపంగా మారింది. అంతేకాకుండా పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థరసాయనాలతో మూసీ పరివాహక ప్రాంతంలోని జలాలు కలుషితమయ్యాయి. ఆక్రమణలు తొలగించి మూసీకి పూర్వవైభవం తీసుకురావడం సంతోషం. మూసీ అభివృద్ధితో పరివాహక ప్రాంత ప్రజలకు ఎంతోమేలు జరుగుతుంది.

- మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మేడ్చల్ జడ్పీ చైర్మన్

బీసీ సంక్షేమానికి మొండి చెయ్యి



రాష్ట్ర జనాభాలో 55శాతమున్న బీసీ సంక్షేమానికి బడ్జెట్‌లో 8 వేల కోట్లు కేటాయించడం సిగ్గు చేటు. ప్రభుత్వం బీసీలను ఓటర్లుగానే చూస్తుందని, రాష్ట్ర బడ్జెట్‌లో వారికి మొండి చెయ్యి చూపింది. మిగతా సంక్షేమ శాఖలకు బడ్జెట్‌లో అధికంగా నిధులు కేటాయించి, బీసీ సంక్షేమానికి మాత్రం నామమాత్రంగా నిధులు ఇవ్వడం అన్యాయం.

- ఏనుగు సుదర్శన్‌రెడ్డి, ఎంపీపీ ఘట్‌కేసర్

నిరాశ పరిచిన బడ్జెట్



పరిగి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ తీవ్ర నిరాశకు గురి చేసింది. బడ్జెట్‌లో రైతు రుణమాఫీకి నిధులు కేటాయించి ఒకే దఫాలో రెండు లక్షల పంట రుణాలన్నీ మాఫీ చేస్తారని ఆశ పడ్డాం. బడ్జెట్‌లో వ్యవసాయానికి కేటాయింపులు చూస్తే రైతుబంధుకు కూడా సరిపోయేలా లేదు. ఎన్నికల ముందు ఒకే దఫాలో రెండు లక్షల రైతు రుణమాఫీ అని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారు. ఈ సారి వడ్డీ భారం తప్పేలా లేదు. ప్రభుత్వం రైతులను మోసం చేసింది.

- టి.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, రైతు, సుల్తాన్‌పూర్, పరిగి

నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదు



వ్యవసాయానికి అరకొర నిధులు కేటాయించారు. ఆరు గ్యారంటీల అమల్లో స్పష్టత లేదు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, నిరుద్యోగ భృతి ప్రస్తావ లేదు. కౌలు రైతులకు రైతుబంధుకు కేటాయింపుల్లేవు.

- పాలమాకుల జంగయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి

నలుగురు తహసీల్దార్ల బదిలీ

- ఆస్థానంలో కొత్తగా కేటాయింపు



వికారాబాద్, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. వికారాబాద్ జిల్లాలో పనిచేస్తున్న నలుగురు తహసీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీ చేయగా, వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న నలుగురు తహసీల్దార్లను జిల్లాకు కేటాయించారు. బషీరాబాద్ మండల తహసీల్దార్ ఎన్.వెంకటస్వామిని సంగారెడ్డిజిల్లాకు బదిలీ చేయగా, తాండూరు ఆర్డీవో కార్యాలయం డీఏవోగా విధులు నిర్వహిస్తున్న మహేష్‌గౌడ్ నల్లగొండ జిల్లాకు బదిలీ అయ్యారు. కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్లుగా పనిచేస్తున్న కె.శ్రీనివాస్, ఎండీ నైమత్ అలీలను నారాయణపేట జిల్లాకు బదిలీ చేశారు. కాగా, నల్లగొండ జిల్లా, గట్టుప్పల్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వి.లావణ్య, సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నఫీస్ ఫాతిమా, అదే జిల్లా హత్నూర మండల తహసీల్దార్ ఎస్.సంధ్య, నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండల తహసీల్దార్ కె.శివ శ్రీనివాస్‌లను జిల్లాకు కేటాయించారు. జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన తహసీల్దార్లను వెంటనే రిలీవ్ చేయాలని నవీన్‌మిట్టల్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

వీవీ ప్యాట్ల పరిశీలన క్షుణ్ణంగా చేపడతాం

ఉపాధి కింద సీసీ రోడ్డు పనులు చేపట్టాలి : కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 10 : వీవీ ప్యాట్ల మొదటి స్థాయి పరిశీలన క్షుణ్ణంగా చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం వికారాబాద్‌లోని ఈవీఎంల గిడ్డంగిని సందర్శించి బీయూ, వీవీ ప్యాట్లు, సీయూల మొదటి స్థాయి పరిశీలనను పరిశీలించి, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఆరు రోజులుగా ఈవీఎంల మొదటి పరిశీలనలో భాగంగా ఇప్పటికీ బీయులు 45 శాతం, వీవీ ప్యాట్స్ 50 శాతం, సీయూలు 60 శాతం ఎఫ్ ఎల్‌సీ పూర్తి అయిందన్నారు. మిగతావి సమయంలోపు పూర్తి చేసేందుకు ఈసీఐఎల్ సాంకేతిక నిపుణులు పని చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ తో పాటు ఆర్డీవో విజయ్ కుమారి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వీవీ ప్యాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రోడ్ల పనులను త్వరగా ప్రారంభించాలి

ఉపాధి హామీ పథకం కింద జిల్లాలోని అన్ని గ్రామాల్లో కేటాయించిన సీసీరోడ్ల పనులను త్వరగా ప్రారంభించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. శనివారం అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో కేటాయించబడిన సీసీ రోడ్ల పనులను వెంటనే ప్రారంభించి ఫిబ్రవరి, 15 వరకు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ప్రజాపాలన దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన పారదర్శకంగా నిర్వహించాలన్నారు.కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, ఆర్డీవోలు విజయకుమారి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

భూముల పరిశీలనను అడ్డుకున్న గిరిజనులు

- అధికారులు, గిరిజనుల మధ్య వాగ్వాదం
- పరిస్థితి ఉద్రిక్తం



ఆర్డీవో, తహసీల్దార్ వాహనాలను అడ్డుకుంటున్న గిరిజనులు

పరిగి,ఫిబ్రవరి 10: భూముల పరిశీలనకు వచ్చిన అధికారులను గిరిజనుల అడ్డుకున్న ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పరిగి మండలం రంగంపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్లు 51, 62లోని వివాదాస్పద భూములను పరిశీలించేందుకు వచ్చిన ఆర్డీవో విజయకుమారి, పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావు, డీటీ మోహన్‌లను శల్మాజాలతండావాసులు అడుకున్నారు. సర్వేనంబరు 62లో 332 ఎకరాలు, 51లో 16.20 ఎకాల భూమి ఉంది. ఈ భూములకు దశాబ్దాల క్రితం అబ్దుల్ వదూద్ అనే వ్యక్తిపై పేరిట ఉండగా వారి నుంచి సీలింగ్‌కు వెళ్లడం, ప్రభుత్వానికి సరెండర్ చేసిన తర్వాత అతని వారసుడు వాజిద్ పేరిట సర్వే నెంబరు 62లో నాలుగు ఎకరాలు, 51లో 6.11 ఎకరాల భూమి రికార్డుల్లో ఉంది. అయితే భౌతికంగా ఇతరులు ఉన్నారు. ఈ భూమి పొజిషన్‌ను ఇప్పించాలని సదరు వారసులు వాజిద్ కోర్టుకు వెళ్లారు. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి అధికారుల బృందం సర్వేనంబర్లలోని భూములను పరిశీలించడానికి వెళ్లారు. అయితే ఇదే సర్వేనంబర్లలో మా భూములు ఉన్నాయి, మీరేందుకు పరిశీలించడానికి వచ్చారని అధికారులను గిరిజనులు నిలదీశారు. అయినా రాత్రిసమయంలో రావడం ఏంటని ప్రశ్నించారు. మాకు అన్యాయం చేసి, భూస్వాములకు కొమ్ముకాసే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారంటూ ఆర్డీవో, తహసీల్దార్‌ల వాహనాలకు అడ్డంగా నిలిచి నిలదీశారు. దీంతో అధికారులు, గిరిజనుల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మీకు అన్యాయం ఎందుకు చేస్తాం, కోర్టులో నడుస్తున్నందున వచ్చామని సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఈ విషయంపై తహసీల్దార్ ఆనంద్‌రావు మాట్లాడుతూ, 51, 62 సర్వే నంబర్లలో వాజిద్ అనే వ్యక్తి కోర్టులో కేసు వేశాడన్నారు. తన పట్టా భూమి లావణిపట్టాగా పడిందని, దానికి పట్టాగా మార్చాలని పిటిషన్ వేసినందుకు తాము భూములను పరిశీలించేందుకు వచ్చామని తెలిపారు. ఎవరికి అన్యాయం చేయమని, రికార్డుల ప్రకారమే పని చేస్తామని తెలిపారు.

జోరుగా కందులు, వేరుశనగ విక్రయాలు

ధారూరు, ఫిబ్రవరి 10: ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో కందులు, వేరుశనగ క్రయవిక్రయాలు శనివారం సాయంత్రం నిర్వహించారు. కందులు 453 బస్తాలు రాగా 226.5 క్వింటాళ్ల కందులకు గరిష్ఠంగా క్వింటాల్‌కు రూ. 10,450, కనిష్ఠంగా రూ.10,300లకు బీట్లలో ఖరీదు దారులు కొనుగోలు చేశారు. వేరుశనగ 1500 బస్తాలు రాగా, 450 క్వింటాళ్లను గరిష్ఠంగా క్వింటాలుకు రూ. 7వేలు, కనిష్ఠంగా రూ. 6,500లకు కొనుగోళ్లు జరిగాయని మార్కెట్ కమిటీ సహాయ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు.

చెత్త వేస్తే.. చెప్పుల దండ

- చెరువు నీరు కలుషితం కాకుండా చర్యలు
- స్థానికుల వినూత్న ప్రయత్నం

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి10 : మేడ్చల్ పట్టణంలోని తుమ్మ చెరువు కలుషితమవుతోంది. పరిసరాల్లో కొందరు చెత్తా చెదారం వేయడంతో కంపుకొడుతోంది. చెత్త డంపింగ్ చేస్తూ అపరిశుభ్రం చేస్తుండటంతో స్థానిక ప్రజలు చెరువు కట్టపై చెప్పులు దండలు ఏర్పాటు చేసి వినూత్నంగా నిరసన తెలుపుతున్నారు. పట్టణం నడిబొడ్డున ఉన్న తుమ్మ చెరువును ఊట చెరువుగా మార్చాలన్న ఉద్దేశంతో అధికారులు చర్యలు చేపడుతున్నారు. అయితే స్థానిక ప్రజలు కొందరు చెరువు పరిసరాల్లో చెత్తను డంపింగ్ చేస్తున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పేరిట స్థానిక మున్సిపల్ అధికారులు ఇంటింటికీ తిరిగి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ కొందరు మాత్రం చెత్త సేకరించే మున్సిపల్ వాహనాల్లో వేయకుండా చెరువు పరిసరాల్లో పారబోస్తున్నారు. సమీప కాలనీ వాసులు పలు మార్లు హెచ్చ రించినా చెత్త డంపింగ్ రాయుళ్లలో మార్పు రావడం లేదు. దీంతో చెత్త డంప్ చేసే ప్రాంతాలు, చెరువు కట్ట పై అక్కడక్కడ చెప్పుల దండలను ఏర్పాటు చేసి పరోక్షంగా హెచ్చరికలను జారీ చేశారు.



చెరువు పరిసరాల్లో డంపింగ్ చేసిన చెత్త

కంపు కొడుతున్న చెరువు పరిసరాలు

తుమ్మ చెరువు పరిసరాల్లో వేస్తున్న చెత్త డంపింగ్‌తో అందులోని నీరు కలుషితమై దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో పరిసర కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో స్థానికులు చెరువుకట్టపై వాకింగ్ చేస్తుండటంతో ముఖానికి మాస్క్ ధరించాల్సిన పరిస్థితి నెలకొంది. అదే విధంగా చెరువుకట్టపై ఉన్న అమ్మ వారి ఆలయానికి వచ్చే భక్తులకు కూడా దుర్వాసనతో ఆలయం వద్ద సమయం వెచ్చించలేని పరిస్థితి నెలకొంది. ఆలయ సమీపంలో చెత్త డంపింగ్ చేస్తున్నందున భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ కాలనీ చెరువు కట్టకు ఆనుకుని ఉన్నందున ఈ కాలనీ వాసులు నిత్యం దుర్వాసనను భరించాల్సిన పరిస్థితి నెలకొంది.



తుమ్మ చెరువు కట్టపై ఏర్పాటు చేసిన చెప్పుల దండ

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

తుమ్మచెరువు పరిసరాల్లో చెత్త డంప్ చేస్తున్న వారి గురించి తెలిసినా మున్సిపల్ అధికారులు ఎట్టించుకోవటం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని మటన్ , చికెన్ షాపుల వ్యర్థాలతో పాటు హోటళ్లలో కుళ్లిన తినుబండారాను తీసుకొచ్చి చెరువు అంచుల్లో పారబోసి వెళ్తున్నారు. దీనికి తోడు పలు ఫంక్షన్ హాళ్ల నుంచి వెలువడే చెత్తను నేరుగా చెరువు వద్ద వదిలివెళ్తున్నారు. ప్రధాన మార్కెట్‌లోని పలు దుకాణాల యజమానులు, పండ్ల వ్యాపారస్తులు కుళ్లిన పండ్లను చెరువు అంచుల్లో డంప్ చేస్తున్నారు. ఫలితంగా చెరువు పరిసరాలు అపరిశుభ్రంగా మారి స్థానికులకు ఇక్కట్లు తప్పటం లేదు.

● మోమిన్‌పేట్: శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు మల్లేశం విద్యార్థులకు ప్రేరణ పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు.

చదువుతో పాటు యువత క్రీడారంగంలోనూ రాణించాలి



చేవెళ్లలో క్రికెట్ ఆడుతూ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల, ఫిబ్రవరి 10: యువత చదువుతో పాటు క్రీడా రంగం లోనూ రాణించాలని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. కొండా వెంకట్‌రంగారెడ్డి, జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్ శనివారం చేవెళ్లలోని కేవీఆర్ గ్రౌండ్‌లో మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, పలువురు నాయకులతో కలిసి విశ్వేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల క్రీడాకారుల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ టోర్నమెంట్ దోహదం చేస్తుందని అన్నారు. 2నెలల పాటు మెగా ఈ క్రికెట్ టోర్నీ కొనసాగుతుందన్నారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధి 7 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 100జట్లు ఈ టోర్నీలో పాల్గొటాయన్నారు. ఈ పోటీల్లో విజేతకు షీల్డ్, రూ.3లక్షల నగదు బహుమతి, రన్నరప్స్‌కు రూ.2లక్షల బహుమతి ఇస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగి గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. నేటి గెలుపును భవిష్యత్తుకు బంగారు బాటలుగా మలుచుకోవాలని, అలాగే ఓటముల నుంచి పాఠాలు నేర్చుకుంటూ గెలుపునకు ప్రయత్నం సాగించాలని విశ్వేశ్వర్‌రెడ్డి యువకులకు సూచించారు. ఆ రోజుల్లోనే వెంకట్‌రంగారెడ్డి, మాధవరెడ్డి వారి బీజీ లైఫ్‌లోనూ క్రికెట్, హాకీ తదితర ఆటలు ఆడటంతో పాటు ఇతరులతో ఆడించేవారని గుర్తుచేశారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే రత్నం, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ.. క్రీడాకారులను వెలికితీసేందుకు ఏర్పాటు ఈ టోర్నీని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, యువత మధ్య స్నేహభావం పెరుగుతాయన్నారు. లోక్‌సభ నియోజకవర్గ స్థాయిలో టోర్నీ నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రాందేవ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జంగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, వివిధ స్థాయిల నాయకులు కావ్యకృష్ణగౌడ్, కుంచం శ్రీనివాస్ గుప్తా, దేవుని శర్వలింగం, వెంకట్‌రెడ్డి, పి.సత్యనారాయణ, కృష్ణారెడ్డి, అశోక్, శ్రీనివాస్, నాగారాజు, ఆయా మండలాల క్రీడాకారులు, యువకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తిచెంది ఆటో డ్రైవర్ ఆత్మహత్య



ఆమెర్ ఖాన్(ఫైల్)

ధారూరు, ఫిబ్రవరి 10 : జీవితంపై విరక్తితో ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా స్టేషన్ ధారూరు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. స్టేషన్ ధారూరుకు చెందిన ఎండీ.హమీద్‌ఖాన్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు ఆమెర్‌ఖాన్(21) సైతం తండ్రి చేస్తున్న వృత్తిలోనే కొనసాగుతున్నాడు. కాగా ఆమెర్ కొంత కాలంగా మానసికంగా కుంగిపోయి ఉంటున్నాడు. ఈ నెల 9న స్టేషన్ ధారూరులోని తన పాత ఇంటి వద్ద పురుగుల మందు తాగి పడిపోయాడు. సమాచారం అందుకున్న తండ్రి అక్కడికి చేరుకుని ఆమెర్‌ను వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించాడు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు రెఫర్ చేశారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆమెర్ కోలుకోలేక శుక్రవారం రాత్రి చనిపోయాడు. తన జీవితం ఇంతే అంటూ ఆమెర్ మనోవేదనకు గురయ్యేవాడని అతడి తండ్రి హమీద్ పోలీసులకు తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డీఎడ్ కోర్సులో అడ్మిషన్లకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

వికారాబాద్, ఫిబ్రవరి 10: రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో రెండేళ్ల డీఎడ్ కోర్సులో చేరేందుకు డీఈఈ.సెట్ ఉత్తీర్ణులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ ఈ నెల 14న మరోసారి నిర్వహిస్తామని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామాచారి శనివారం తెలిపారు. వికారాబాద్‌లో గల డైట్ కాలేజీలో పరిశీలన ప్రక్రియ ఉంటుందని, 15 నుంచి 17వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలన్నారు. 22న సీట్లు కేటాయిస్తారన్నారు. ఎంపికైన వారు ఈ నెల 26వ తేదీలోగా సీటు అలాటైన కాలేజీలో ఫీజు చెల్లించి అడ్మిషన్ తీసుకోవాలని సూచించారు.

మిషన్ భగీరథ సామగ్రి కంపెనీల పాలు!

- భారీగా తరలిస్తున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు



పరిగిలో మిషన్ భగీరథ సామగ్రితో పట్టుబడిన డీసీఎం

పరిగి, ఫిబ్రవరి 10 : విలువైన సామగ్రిని స్క్రాప్‌కింద విక్రయిస్తున్నారు. మిషన్ భగీరథకు చెందిన సామగ్రిని డీసీఎం(ఏపీ23 డబ్ల్యూ8731)లో తరలిస్తుండగా శనివారం పరిగిలో పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వాహనం స్క్రాప్‌ను వికారాబాద్ వైపు నుంచి పరిగిలోని స్టీల్ కంపెనీలకు తరలిస్తుండగా పట్టుకున్నారు. స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు, మిషన్ భగీరథ అధికారులు సమాచారం ఇచ్చారు. వాహనంలో మిషన్ భగీరథ సామగ్రి ఉందని ప్రాథమికంగా గుర్తించారు. ఈ వస్తువులను ఎక్కడ నుంచి తెస్తున్నారని పోలీసులు అడగ్గా మర్పల్లి నుంచి అని డీసీఎం డ్రైవర్ చెప్పాడు. పట్టుకున్న డీసీఎంను అధికారులు వదిలేశారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇలా నిత్యం వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఇనుము, పైప్‌లు తదితర సామగ్రిని అక్రమంగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పరిగి, వికారాబాద్ ప్రాంతాల నుంచి నిత్యం ఇలా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇనుప సామగ్రిని పరిగిలో గల సుగుణ, శిఖర, అభిరామ్ కంపెనీలకు తరలిస్తున్నారని చెబుతున్నారు. కంపెనీ యజమానులు తక్కువ ధరకు సామగ్రిని దొడ్డిదారిన కొంటున్నారు. స్క్రాప్ అమ్మకాలు ఏళ్లుగా కొనసాగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



డీసీఎంలో తరలిస్తున్న పైప్‌లైన్ సామగ్రి

బుక్ కీపర్ సస్పెన్షన్

దోమ, ఫిబ్రవరి 10: అవకతవలకు పాల్పడిన మోత్కుర్ మహిళా సంఘం బుక్‌కీపర్ మల్లేశంను సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు.కొన్ని సంవత్సరాల క్రితం మహిళా సంఘం నిధులను దుర్వినియోగం చేసిన బుక్ కీపర్‌పై ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన డీఆర్‌డీఏ అధికారులు ఈ నెల 3న అతడిని సస్పెండ్ చేసి విధుల నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. కాగా ఏపీఎం సురేశ్ ఈ సమాచారాన్ని గోప్యంగా ఉంచుతూ మల్లేశంను విధుల్లో కొనసాగించడంతో ఏపీఎం తీరుపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పట్టు తప్పితే పడిపోవడమే!

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 10: రోడ్డుపై వాహనాల్లో ప్రయాణించే సమయాల్లో ఎంత జాగ్రత్తగా వెళ్తున్నా కొన్నిసార్లు ప్రమాదాలు జరుగుతుంటాయి. అలాంటిది నిర్లక్ష్యంగా ఆటోలో వెనక డోరు సరిగా వేయకుండానే రయ్యిమంటూ దూసుకెళ్తూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న దృశ్యం ఇక్కడ కన్పిస్తోంది. శనివారం హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై అజీజ్‌నగర్ వద్ద ఓ ఆటోలో ప్రయాణికులు ఆటో వెనుక డోరు తీసి కూర్చొని ప్రయాణించాడు. నిత్యం చలానాలు విధించే రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులకు ఇలాంటివి కనిపించడం లేదా? అని తోటి ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.



బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట



మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేసరి సంజీవరెడ్డి

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి10: ప్రజా పాలనలో ప్రజల సంక్షేమానికే రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పెద్దపీట వేసిందని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేసరి సంజీవరెడ్డి అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణుల సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలకు బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించారన్నారు. కాంగ్రెస్ పాలనలోకి వచ్చిందే ఆరు గ్యారంటీల హామీతో అని, వాటి అమలుకు బడ్జెట్‌లో రూ.53.196కోట్లు కేటాయించడం చూస్తే కాంగ్రెస్ చిత్తశుద్ధి స్పష్టం అవుతోందన్నారు. వ్యవసాయ రంగానికి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు, విద్యా రంగాలకు నిధులు భారీగా కేటాయించడం సంతోషకరం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను బురిడీకొట్టించి, కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని సంజీవరెడ్డి మండిపడ్డారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్లతో పాటు, రాష్ట్రంలోని అత్యధిక ఎంపీ సీట్లను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో 15 నుంచి బ్రహ్మోత్సవాలు



తలకొండపల్లి, ఫిబ్రవరి 10: మండలంలోని చుక్కాపూర్‌లో గల ప్రసిద్ధ శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు కొనసాగే ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. చుట్టు పక్కల మండలాల భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొంటారు. 15న గణపతిపూజ, దీపారాధన, 16న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుల కల్యాణోత్సవం, అన్నదానం, 17న అర్చన, బండలాగుడు పోటీలు, 18న రథోత్సవం, 19న సత్యనారాయణస్వామి వ్రతాలు, చక్రతీర్థం కార్యక్రమాలుంటాయని అర్చకులు వెంకటేశ్వరశర్మ వివరించారు.

అన్మాస్‌పల్లిలో ఘనంగా హనుమత్ హోమం



పూజల్లో పాల్గొన్న నాయకులు, గ్రామస్తులు

కడ్తాల్ , ఫిబ్రవరి 10: మండల పరిధిలోని అన్మాస్‌పల్లి శ్రీర వీరాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం హనుమత్ హోమం, సాముహిక సత్యనారాయణ వ్రతాలు, అభిషేకాలు , ప్రత్యేక పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ పోతుగంటి శంకర్ ప్రియాంక దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షుడు కోర్పోలు లక్ష్మారెడ్డి, పిరమిడ్ స్పిర్చ్యువల్ సొసైటీస్ మూమెంట్ ఆఫ్ ఇండియా విజయభాస్కర్ రెడ్డి, జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామి ప్రత్యేక పూజలు, అభిషేకాలు కొనసాగాయి, భక్తుల హనుమ నామస్మరణతో వీరాంజనేయ స్వామి దేవాలయం మార్మోగింది. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకుడు శంకర్ ఆధ్వర్యంలో బక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు బీచ్యానాయక్, రాములు, నరేందర్, వేణుగోపాల్, గూడూరు భాస్కర్ రెడ్డి, చేగూరి వెంకటేశ్, లక్ష్మయ్య, జగన్‌గౌడ్, నర్సింహ్మా గౌడ్, జగన్, వెంకటేశ్, కేశవులు, పర్వతాలు, రామకృష్ణ , భరత్, తదితరులు పాల్గొన్నారు.

మూడోసారీ ప్రధాని నరేంద్రమోదీనే..



మాట్లాడుతున్న మాధవరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 10 : దేశంలో మూడోసారీ నరేంద్రమోదీ ప్రధాని కావడం ఖాయం అని, దేశ భక్తి, సిద్ధాంతాలు కలిగిన పార్టీ బీజేపీ అని ఆ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో సమావేశంనిర్వహించి జిల్లా కమిటీని ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా అంతారం లలిత(తాండూరు), టి.రాజేందర్‌రెడ్డి, రాములు, ఎస్.శ్రీధర్‌రెడ్డి(వికారాబాద్), ప్రధాన కార్యదర్శులు విజయభాస్కర్‌రెడ్డి(వికారాబాద్), కృష్ణ(తాండూరు), రాంచందర్(పరిగి), కార్యదర్శులు విజయ్‌రాజ్, జగన్, మల్లేశ్, రాకేష్, భద్రేశ్వర్, శ్రీకాంత్, పెంటయ్యగుప్తా, ట్రెజరర్ పి.సతీష్, ఆఫీస్ సెక్రటరీ యాదగిరి, అధికార ప్రతినిధి వెంకట్, బీజేవైఎం అధ్యక్షుడిగా చరణ్‌రెడ్డి, లేడీ వింగ్‌కు శిరీష, కిసాన్ మోర్చా సంజీవరెడ్డి, ఎస్సీ మోర్చాకు గాలయ్య, బీసీ మోర్చా శ్రీహరి, ఎస్టీ మోర్చా గోవింద్, మైనార్టీ మోర్చాకు జాకీర్ జహీర్ అబ్బాస్‌లను నియమించారు.

బడ్జెట్ అంకెల గారడీలా ఉంది : నర్సింహారెడ్డి



రంగారెడ్డి అర్బన్: రాష్ట్ర బడ్జెట్ రాజకీయ ప్రసంగంలా ఉందని, అన్ని వర్గాల ప్రజలను నిరాశపర్చిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఇదో అంకెల గారడీ బడ్జెట్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు చాలీచాలని నిధులు కేటాయించారన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ప్రస్తావనే లేదని విమర్శించారు. ఆరు గ్యారంటీలకు నిధులు కేటాయించలేదని, నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదని విమర్శించారు.

తెలంగాణ ప్రయోజనాలు ఢిల్లీకి తాకట్టు



ఇబ్రహీంపట్నంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ←

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 10: తెలంగాణ ప్రజాప్రయోజనాలను కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ పాలకులకు తాకట్టు పెడుతోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఇబ్రహీంపట్నంలోని పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ ముఖ్య నేతలు, మండల నాయ కులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. దక్షిణ తెలంగాణ రాష్ట్రాన్ని ఎడారిగా మార్చేలా కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడం కాంగ్రెస్ ప్రభుత్వ ఘోర తప్పిదమన్నారు. పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఎంత ఒత్తిడి తెచ్చినా కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టుల అప్పగింతకు ఒ ప్పుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లోనే ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించిందన్నారు. కృష్ణ, గోదావరి నదుల జలాలు తెలంగాణలోని ప్రతి ఎకరానికీ చేరేలా కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలను పూర్తిచేసిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి కాలువలు తవ్వడమే మిగిలిందని, అవి పూర్తయితే 12లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందనిన్నారు. ఇప్పుడు ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగిస్తే ప్రయోజనముండదని ఆవేదన వ్యక్తంచేశారు. పాలమూరు ప్రాజెక్టులో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం చివరి ఆయకట్టు అని, రాచకొండ లిఫ్ట్‌తో అవసరమైన సాగునీ రొస్తుందన్నారు. కాంగ్రెస్ పాలకుల నిర్ణయానికి నిరసనగా ఈ నెల 13న బీఆర్ఎస్ చేపట్టే చలో నల్లగొండ పోరుసభకు రైతులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకుడు వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేష్, పార్టీ వివిధ మండలాల అధ్యక్షులు రాములు, రమేష్, కిషన్‌గౌడ్, మున్సిపల్ అధ్యక్ష కార్యదర్శులు జంగయ్య, దా మోదర్, వేణుగోపాల్‌రావు, బాషా పాల్గొన్నారు.

టీపీఆర్ఎంఈఏ క్యాలెండర్ ఆవిష్కరణ



టీపీఆర్ఎంఈఏ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

వికారాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం (టీపీఆర్ఎంఈఏ) రాష్ట్ర కార్యవర్గం రూపొందించిన క్యాలెండర్‌ను శనివారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసిరి అనసూయ (సీతక్క) ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో మంత్రి నివాసంలో జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకుల నందకుమార్, బాధ్యులు ఎం.రాజేష్, అజయ్‌కుమార్, చంద్రమౌళి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా మల్లేశ్‌యాదవ్



మల్లేశ్‌యాదవ్

మర్పల్లి, ఫిబ్రవరి 10: బీజేపీ వికారాబాద్ జిల్లా నూతన కమిటీలో మర్పల్లి గ్రామానికి చెందిన మల్లేశ్‌యాదవ్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2006 నుంచి బీజేపీలో అంచెలంచెలుగా ఎదుగుతూ రెండు పర్యాయాలుగా మండల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి పార్టీ అభివృద్ధికి ఆయన కృషి చేశారు. దీంతో బీజేపీ జిల్లా కమిటీలో కార్యదర్శిగా నియమించడం పట్ల పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లేశ్‌యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించడంతో పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు.

జీటీఏటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



తాండూరు విద్యావనరుల కేంద్రంలో క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న అధికారులు

తాండూరు రూరల్, ఫిబ్రవరి 10: తాండూరులోని మండల విద్యావనరుల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం(జీటీఏటీఎస్) క్యాలెండర్, డైరీలను శనివారం ఆవిష్కరించారు. తహసీల్దార్ తారాసింగ్, ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి, ఎంపీవో రతన్‌సింగ్, ఎంఈవో వెంకటయ్యగౌడ్ హాజరై ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంలు సత్యనారాయణ, ఇందుప్రియ, టీజీఏటీఎస్ జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేష్, కోశాధికారి సుధీర్, తాండూరు మండల అధ్యక్షుడు వెంకట్‌రాములు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయాలి

కొడంగల్, ఫిబ్రవరి 10: ఈ నెల 16న కిసాన్‌మోర్చా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని రాష్ట్ర రైతు సంఘం వికారాబాద్ జిల్లా నాయకుడు సురేశ్ కోరారు. స్థానిక ఐబీలో శనివారం గ్రామీణ బంద్ పోస్టర్‌ను విడుదలచేసి మాట్లాడారు. కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న గ్రామీణ బంద్‌లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా కార్మిక సంఘం నాయకులు మల్లప్ప, అంజిలప్ప, బాల్యానాయక్, రామునాయక్, బాబ్యనాయక్, హన్మంతు పాల్గొన్నారు.

విశ్వకర్మ ఆల్ ఇండియా ఫెడరేషన్ నియోజకవర్గ నూతన కమిటీ

కొడంగల్, ఫిబ్రవరి 10: శ్రీశ్రీ విరాట్ విశ్వకర్మ ఆల్ ఇండియా ఫెడరేషన్ కొడంగల్ నియోజకవర్గ నూతన కమిటీని రాష్ట్ర ఇన్‌చార్జి మాదారం శ్రీనివాసచారి ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. తాలూకా అధ్యక్షుడు వడ్ల బ్రహ్మయ్యచారి, తాలూకా ఇన్‌చార్జి వడ్ల రాఘవేంద్రచారి, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల రవీంద్రచారి, యూత్ ప్రెసిడెంట్ రాజేశ్‌చారితో పాటు నియోజకవర్గంలోని ఆయా మండలాల అధ్యక్షుల సమక్షంలో తాలూకా కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ మండల అధ్యక్షుడు దశరథచారి, దౌల్తాబాద్ మండల అధ్యక్షుడు వెంకట్రాములుచారి, బొంరాస్‌పేట్ మండల అధ్యక్షుడు వెంకటేశ్‌చారి, దుద్యాల మండల అధ్యక్షుడు కాలప్ప చారి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలి

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 10: గ్రామాల్లో పంచాయతీ కార్మికులు పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలని కొడంగల్ తహసీల్దార్, ప్రత్యేకాధికారి విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని రుద్రారం గ్రామంలో శనివారం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా రూ.500కే గ్యాస్ సిలిండర్ కోసం అర్హులైన లబ్ధిదారుల నుంచి వచ్చిన దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యదర్శి లబ్ధిదారుల వివరాలను పరిశీలిస్తుండగా తహసీల్దార్ పర్యవేక్షించారు. అనంతరం గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడంతో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, గ్రామస్తులు వెంకటయ్య, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభం

వికారాబాద్, ఫిబ్రవరి 10: త్వరలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు మున్సిపల్ ఫ్లోర్ లీడర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెలాఖరు వరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. క్యాంపు కార్యాలయం చుట్టూ గార్డెన్ ఏర్పాటు చేయడంతో పాటు వచ్చీపోయే వారికి సౌకర్యార్థం వాష్ రూమ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. త్వరలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సమక్షంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట మున్సిపల్ కౌన్సిలర్ మురళి పాల్గొన్నారు.

కొడంగల్ అభివృద్ధికి భారీగా నిధులు

- రోడ్ల నిర్మాణానికి రూ.213కోట్లు మంజూరు
- కాంగ్రెస్ నాయకుల హర్షం



బొంరాస్‌పేట్‌లో విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

బొంరాస్‌పేట్/కొడంగల్/దౌల్తాబాద్, ఫిబ్రవరి 10: సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో ఐదు మండలాల్లో పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి రూ.213కోట్లు మంజూరైనట్లు బొంరాస్‌పేట్, దుద్యాల, కొడంగల్ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఆయా మండలాల్లో వారు వేర్వేరుగా శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిధుల మంజూరీపై హర్షం వ్యక్తం చేశారు. బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల నిర్మాణానికి రూ.7కోట్ల 13 లక్షలు మంజూర్ చేసినట్లు ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని ఉమ్మడి ఐదు మండలాలకు 119.01 కిలో మీటర్ పంచాయతీరాజ్ రోడ్లకు రూ.213కోట్ల 20లక్షల 70వేలు మంజూరైనట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, ఆవుటి శేఖర్, ఎన్.ప్రశాంత్ తెలిపారు. ఉమ్మడి బొంరాస్‌పేట్ మండలానికి 17.25కిలో మీటర్ల పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధికి రూ.38 కోట్ల 61లక్షల 70వేలు మంజూరైనట్లు తెలిపారు. బొంరాస్‌పేట్ మండలం మెట్లకుంట నుంచి లోతుకుంట మీదుగా గుబ్బడి తండా వరకు రూ.3కోట్ల 24లక్షల 50వేలు, యాలాల మండలం నాగసముందరం నుంచి దేవనూర్, గుబ్బడితండా మీదుగా మహంతీపూర్, జానకంపల్లి వరకు రూ.23 కోట్ల 86 లక్షల 95వేలు, ఎక్కచెరువు తండా అప్రోచ్ రోడ్డుకు రూ.75 లక్షలు, దుద్యాల నుంచి అల్లిఖాన్‌పల్లి మీదుగా నాచారం వరకు రూ.7కోట్ల 28లక్షలు, జడ్పీ రోడ్డు నుంచి సత్తర్‌కుంట తండా వరకు రూ.కోటీ 89లక్షల 25వేలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి బాపన్‌చెరువు తండా వరకు రూ.1కోటి 58లక్షలు మంజూరయ్యాయి. అదేవిధంగా కొడంగల్ మండలం చిలుముల్‌మైలారం నుంచి పలుగురాళ్ల, ఎక్కచెరువు తండా మీదుగా హస్నాబాద్ వరకు రూ.9కోట్ల 59 లక్షల 50వేలు, ఖాజఅహ్మద్‌పల్లి నుంచి జడ్పీరోడ్డు వర కు రూ.1 కోటి 33 లక్షలు, అంగడిరైచూర్ నుంచి సంగాయిపల్లి మీదుగా లక్ష్మీపల్లి వరకు రూ.4కోట్ల 48లక్షలు, రుద్రారం పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గొట్టికకుర్దు మీదుగా పాటిమీదిపల్లి వరకు రూ.22కోట్ల 88 లక్షలు, 163వ జాతీయ రహదారి నుంచి దౌల్తాబాద్ మండలం అంతారం మీదుగా బిచ్చాల్ వరకు రూ.9కోట్ల 93 లక్షలు, బండివాడ, బండ్లవాడ, అల్లాపూర్ వరకు రూ.4 కోట్ల 16లక్షలు, బాలంపేట్ నుంచి తిరుమలపూర్, నాగసార్, తిమ్మారెడ్డిపల్లి వరకు రూ.9కోట్ల 7లక్షల 75వేలు, కుదురుమళ్ల నుంచి సంగాయి పల్లి మీదుగా నందారం, ఇమ్మాపూర్ వరకు రూ.10కోట్ల 30లక్షల 50వేలు, ఊరకుంట నుంచి ఈర్లపల్లి మీదుగా ఇమ్మాపూర్ వరకు రూ.7కోట్ల 30 లక్షల 25 వేలు, కుప్పగిరి నుంచి చంద్రకల్ పీడబ్ల్యూడీ రోడ్డు వరకు రూ.5 కోట్ల 1 లక్ష నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఇందుకు దుద్యాల, బొంరాస్‌పేట్, కొడంగల్, దౌల్తాబాద్ మండలాల నాయకులు సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజేశ్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి, నాందర్‌పూర్ మల్లికార్జున్, సంతోష్, భీమయ్యగౌడ్, కృష్ణ, అనంతయ్య, రాములు, మెరుగు వెంకటయ్య, శ్రీశైలంగౌడ్, ఖాజమీయ తదితరులు పాల్గొన్నారు.

రూ.213 కోట్ల మంజూరు హర్షణీయం

సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా పంచాయతీరాజ్ రోడ్లకు ప్రభుత్వం రూ.213 కోట్ల నిధులను మంజూరు చేయడం హర్షణీయమని ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్ అన్నారు. శనివారం వారు కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజవకర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, మద్దూర్, కోస్గి, దుద్యాల, కొత్తపల్లి, గుండుమాల్ మండలాల్లోని పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి మోక్షం లభించిందన్నారు. ఈ సమావేశంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.కృష్ణంరాజు, కాంగ్రెస్ మండల ప్రచార కార్యదర్శి ఎస్.సోమశేఖర్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ దాము పాల్గొన్నారు.

పార్కు స్థలం కబ్జాకు యత్నం

- అడ్డుకున్న స్థానికులు

కీసర రూరల్, ఫిబ్రవరి 10: పార్కు స్థలాన్ని పరిరక్షించాలని నాగారం మున్సిపాలిటీ శివసాయి ఎన్‌క్లేవ్ ఫేస్-2 కాలనీవాసులు డిమాండ్ చేశారు. న్యాయస్థానం తీర్పు ఆధారంగా పార్కుస్థలంలో చేపట్టిన కమ్యూనిటీ భవనాన్ని ఎక్స్‌కవేటర్ సాయంతో కూల్చేందుకు పలువురు అక్కడికి చేరుకోగా స్థానికులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణ నెలకొంది. గుర్తుతెలియని వ్యక్తులు స్థానికులను భయభ్రాంతులకు గురిచేశారు. కాలనీ వాసులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి చేరుకుని ఇరువురిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొడా జంగారెడ్డి మాట్లాడుతూ నాగారం రెవెన్యూ సర్వేనంబర్ 156లో శివసాయి ఎన్‌క్లేవ్ ఫేస్-2లో లేఅవుట్ ఏర్పాటు చేస్తున్న సమయంలో 255గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారని తెలిపారు. ఆస్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేసేందుకు పంచాయతీ తీర్మానం చేసిందని తెలిపారు. దానిని కబ్జా చేసేందుకు భూ యజమానులు అక్రమంగా ఇతరులకు విక్రయించారన్నారు. కబ్జాను అడ్డుకుని న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, కోర్టు కాలనీ వాసుల పక్షాల తీర్పునిచ్చిందని వెల్లడించారు. అందులో భాగంగా కాలనీ వాసులంతా కలిసి, సొంత నిధులతో కమ్యూనిటీహాల్ నిర్మిస్తున్నామన్నారు. నకిలీ డాక్యుమెంట్లతో పార్కును కబ్జా చేసేందుకు కబ్జా యత్నిస్తున్నారంటూ ఆరోపించారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పార్కు కబ్జాను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈకార్యక్రమంలో కాలనీవాసులు శ్రీనివాస్, వీరన్నగౌడ్, సుజాత, రజిత, గోవర్దన్ పాల్గొన్నారు.

సమీకృత మార్కెట్ పనులను పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర రూరల్, ఫిబ్రవరి 10 : సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మున్సిపల్ పరిధి శిల్పానగర్‌లో రూ.4.50కోట్లతో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ భవన నిర్మాణ పనులను శనివారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్‌తో కలసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ సుదర్శనం రఘు, కౌన్సిలర్ అనంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనురాగ్‌లో ముగిసిన డేటా సైన్స్ హ్యాకథాన్



హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 10: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో 24గంటల పాటు జరిగిన డేటాసైన్స్ హ్యాకథాన్ శనివారంతో ముగిసింది. ఈ హ్యాకథాన్‌లో 250మంది విద్యార్థులు పాల్గొని రాష్ట్రంలోని ప్రతిష్టాత్మకమైన సంస్థల్లో విభిన్న విద్యా నేపథ్యాల నుంచి ఆరు ఇతివృత్తాలతో 78బృందాలను ఏర్పాటు చేసినట్లు అనురాగ్ యూనివర్సిటీ డేటాసైన్స్ హెచ్‌వోడీ శ్రీదేవి తెలిపారు. నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఇలాంటి హ్యాకథాన్లు దోహదపడుతాయన్నారు. 24 గంటల పాటు కొనసాగిన డేటా సైన్స్ హ్యాకథాన్ విజయవంతం కావడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌సీ హెచ్‌వోడీ విష్ణుమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీచైర్‌పర్సన్ వెంటే నా ప్రయాణం

- బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు

బంట్వారం(కోట్‌పల్లి) ఫిబ్రవరి 10: జడ్పీ చైర్‌పర్సన్ వెంటనే తన ప్రయాణమని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరనున్న పట్నం దంపతులు వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తానని తెలిపారు. ఈమేరకు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. జడ్పీచైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి పార్లమెంట్ స్థానం నుంచి తొలిమహిళగా ఎంపిక కావడం ఖాయమన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా రెండుసార్లు వికారాబాద్ జిల్లా చైర్‌పర్సన్‌గా, ఒక్కసారి గెలుపొందిన సునీతామహేందర్‌రెడ్డి చేవెళ్ల పార్లమెంటుకు పోటీ చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

అన్నివర్గాలను సంతృప్తి పరిచేలా బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎంతో బాగుంది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇది మొదటి బడ్జెట్. మొదటిదే రూ.2.75లక్షల మేర బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత మా ప్రభుత్వానిది. సంక్షేమానికి పెద్ద పీట వేసింది. ఆరు గ్యారంటీ పథకాలకు రూ.53,196కోట్లు కేటాయించింది. పంచాయతీ రాజ్, నీటిపారుదల, వ్యవసాయ శాఖకు ప్రాధాన్యతను ఇచ్చింది. విద్య, వైద్యరంగాలను భారీ కేటాయింపు ఇచ్చింది. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిన ప్రభుత్వంగా నిలవబోతున్నాం. ఆర్థికమంత్రి భట్టి ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ అన్నివర్గాల ప్రజలను సంతృప్తి పరిచింది.

-డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, వికారాబాద్

ప్రజారంజకంగా రాష్ట్ర బడ్జెట్



ధారూరు, ఫిబ్రవరి 10: కాంగ్రెస్ సర్కార్ శనివారం ప్రవేశపెట్టి బడ్జెట్ ప్రజా రంజకంగా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సకలజనుల సంక్షేమ బడ్జెట్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తాం. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని ఎంపీ స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడిస్తాం.

- రఘువీరారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి

వికారాబాద్ సీఐగా నాగరాజు బాధ్యతల స్వీకరణ



ఎస్పీని కలిసిన సీఐ నాగరాజు

వికారాబాద్, ఫిబ్రవరి 10: వికారాబాద్ సీఐగా నాగరాజు శనివారం బాధ్యతలు చేపట్టారు. వికారాబాద్ సీఐగా విధులు నిర్వహించిన టంగుటూరి శ్రీనును ఐజీ ఆఫీస్‌కు బదిలీచేశారు. నాగరాజు గతంలో జోగిపేట పోలీస్ స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహించి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా నాగరాజు వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి రిపోర్టు చేశారు.

పరిగి సీఐగా ఎన్ శ్రీనివాస్



పరిగి సీఐ శ్రీనివాస్

పరిగి: పరిగి పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎన్.శ్రీనివాస్ రానున్నారు. ఇక్కడ ప్రస్తుతం పని చేస్తున్న సీఐ వెంకటరామయ్య సంతోషనగర్‌లోని ఏషాన్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. జోగులాంబ జిల్లాలో గద్వాల్ సీఐగా పని చేస్తున్న శ్రీనివాస్ బదిలీపై పరిగికి వస్తున్నారు. సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. సీఐ శ్రీనివాస్ 2010లో పరిగి,మహమ్మదాబాద్‌లలో ఎస్ఐగా పని చేశారు.

PUBLIC NOTICE

The general public is hereby informed that mr. Varthya Manik rao S/O Roof singh R/o.H NO.2- 77 mekavanampally tand village mominpet mandal and vikarabad dist, approached my client M/s. Shriram Finance Limited, Sadasivpet Branch with a request to advance of loan by offering the following schedule of property standing in his name as a security :

Schedule of property.1

All that the open place in survey no.31/ఆ/1/1 admeasuring 242.0 Sq.yards(sy no.31/ఆ1/1/2 as per nala proceedings no.2400015103) situated at mekavanampally village mominpet Mandal of vikarabad District, District, bounded by : North; remaining land of vendor South; agriculture land of S.Raju East ; agriculture land of mood rajini West ;Road

Schedule of property.2 All that the open place in survey no.31/ఆ/1/1 admeasuring 121.0 Sq.yards(sy no.31/ఆ1/1/2 as per nala proceedings no.2400015103) situated at mekavanampally village mominpet Mandal of vikarabad District, District, bounded by :

North : agriculture land of S.Rajini **South**: Road and water tank. **East** : agriculture land of S.Rajini **West** : agriculture land of manya

As such, if anybody is/are having objections or claims or any manner of right or title or interest over the above said property, may approach me with relevant documents within 7 days from the date of this notice, failing which my client will proceed with loan transaction by accepting the above said property as security, and no objections or claims will be entertained thereafter. Hence this public notice.

Sd/- ARVIND KULKARNI, ADVOCATE, D.NO.4-8-63/4, Old Registration Office Road, Manjeera Nagar, SANGAREDDY TOWN. Ph: 8498832643.

సంక్షిప్తంగా..

- **పరిగి:** ధ్యానంతో జబ్బులు నయమవుతాయని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బి.ఆంజనేయరెడ్డి అన్నారు. మండలంలోని నర్సాయాగూడ, పొల్కంపల్లి, ఖుదావంద్‌పూర్, రావులపల్లి తదితర గ్రామాల్లో శనివారం ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు నవీన్, శైలజ, వేణు, శ్రీను, బాబు తదితరులు పాల్గొన్నారు.
- **ధారూరు:** రైతులు పప్పు దినుసు పంటలు సాగు చేయాలని భారతీయ నూనె గింజల సంస్థ డైరెక్టర్ ఆర్‌కే మాథూర్, ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త రమణారావులు తెలిపారు. ప్రపంచ పప్పు దినుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురుదోట్లలో శనివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పప్పు . దాన్యాల సాగులో రైతులు మెళకువలు పాటిస్తే దిగుబడి బాగా వస్తుందని వారు తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు లక్ష్మమ్మ, శాంతలక్ష్మి, లావణ్య, దివ్య, సురేష్‌లు, ఏపీ అన్‌గ్రావ్ మల్లికార్జున్ రెడ్డి, శ్రీనివాసులు, వికారాబాద్ ఏడీఏ వినోద్‌కుమార్, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.
- **నవాబుపేట:** మండలంలోని అక్నాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా ఉరెంట అమృతమ్మ, ఉపాధ్యక్షురాలిగా ఎస్.తిరుపతమ్మను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎంపీటీసీ ఇక్బాల్, న్యాయవాది ఆనందం, నాయకులు రవీందర్‌రెడ్డి, మురళీగౌడ్, ఓంప్రకాశ్, సాయికుమార్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, రవీందర్, శ్రీనివాస్, పరమేశ్ పాల్గొన్నారు.
- **ఘట్‌కేసర్:** విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఘట్‌కేసర్ విద్యుత్ అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ (ఏడీఈ) శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డు చందుపట్లగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను కౌన్సిలర్ బొక్క సంగీతాప్రభాకర్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ సతీష్ కుమార్, మాజీ సర్పంచ్ వెంకటేష్, మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ పాలకవర్గానికి వీడ్కోలు



పాలకవర్గాన్ని సన్మానిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

ధారూరు, ఫిబ్రవరి 10: మండలంలోని చింతకుటం, హరిదాసుపల్లి గ్రామాలలో పదవీ కాలం ముగిసిన పంచాయతీ పాలక వర్గాలకు హరిదాసుపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. చింతకుంట, హరిదాసుపల్లి తాజా మాజీ సర్పంచులు, ఉపసర్పంచులు లక్ష్మమ్మ, అనితలు, యాదయ్య, సురేష్ గౌడ్‌లు, మాజీ వార్డుల సభ్యులకు పీఏసీఎస్ చైర్మన్ పి.వెంకట్‌రెడ్డి, డైరెక్టర్‌లు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ కృష్ణ, డైరెక్టర్లు కృష్ణవేణి, రాఘవేందర్, అంజయ్య, నర్సింహులు, కిష్టమ్మ, మల్‌రెడ్డి, బుచ్చమ్మ, నర్సింహారెడ్డి, నారాయణ, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కోతులను తప్పించబోయి కారు పల్టీ

- భర్త మృతి
- భార్యాపిల్లలకు తీవ్ర గాయాలు



ఉపేందర్(ఫైల్)



మూసీ ఒడ్డున పడి నుజ్జు నుజ్జయిన కారు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 10: కోతులను తప్పించబోయి కారు పల్టీ కొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. సీఐ గోవర్ధనగిరి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాచారం గ్రామానికి చెందిన మోర ఉపేందర్(37) కుటుంబసభ్యులతో కలిసి మేడారం జాతరకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధి కొర్రెముల సమీపంలోని ఔటర్‌రింగురోడ్డులో కోతులను తప్పించబోయి, ప్రమాదవశాత్తు వంతెనపై నుంచి కారు పల్టీ కొట్టి మూసీనది ఒడ్డున పడింది. ఈ ప్రమాదంలో ఉపేందర్‌కు తీవ్ర రక్తగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్య కావ్య, కూతురు భవ్యశ్రీ, కుమారులు మనోజ్, పృథ్వీలకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నగరంలోని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సిన ఉపేందర్ తిరిగి రానిలోకాలకు వెళ్లిపోయాడని బంధువులు విలపించారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ రిటైర్డ్ రైల్వే ఉద్యోగి..

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 10: రైలుపట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టిన ప్రమాదంలో చికిత్సపొందుతూ ఓ రిటైర్డ్ రైల్వే ఉద్యోగి మృతిచెందాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ రైల్వేపోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. రైల్వేపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ రైల్వే క్వాటర్స్‌లో నివాసముంటున్న విశ్రాంత రైల్వే ఉద్యోగి తాళ్ళపల్లి రాజయ్య(65) శుక్రవారం చాయ్ తాగి వస్తానని కుటుంబసభ్యులకు చెప్పి బయటకు వెళ్లాడు. పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజయ్య రెండు కాళ్ల విరగడంతో పాటు తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సాయంతో వెంటనే అతన్ని నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా రాజయ్య శనివారం సాయంత్రం మృతి చెందినట్లు రైల్వేపోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాట ఆడుతున్న ఐదుగురిపై కేసు నమోదు

పూడూరు, ఫిబ్రవరి 10: మండలంలోని రాకంచర్ల శివారులో పేకాట ఆడుతుండగా ఐదుగురిని పట్టుకున్నట్లు చన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపారు. వారి వద్ద రూ.1300ల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావాలి



చంద్రయాన్‌పల్లిలో కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే ఆనంద్

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 10: రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. మండలంలోని చంద్రయాన్‌పల్లి, రావులపల్లి గ్రామాల్లో శనివారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలన్నారు. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం చంద్రయాన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మల్లేశంకు గుండె ఆపరేషన్ కావడంతో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్దగొల్ల అంజయ్య, మహిపాల్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సొంత నిధులతో సౌకర్యాలు కల్పిస్తా



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్, ఫిబ్రవరి 10: తన సొంత నిధులతో విద్యుత్, తాగునీటి సమస్యలు పరిష్కరిస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తెలిపారు. ఎస్ఏపీ కళాశాల పీజీ బ్లాక్‌లో శనివారం తాత్కాలికంగా కొనసాగుతున్న మెడికల్ కళాశాల బాలికల వసతి గృహాన్ని ఆమె సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. యూజీడీ సమస్యలను పరిష్కరించే విధంగా చూస్తానన్నారు. విద్యార్థులు అర్ధరాత్రి ఫోన్ చేసినా స్పందిస్తానన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి త్వరగా అన్ని సౌకర్యాలు ఉన్నా హాస్టల్ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పీఎం విశ్వకర్మ పథకాన్ని వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న వెంకటేష్

కీసర, ఫిబ్రవరి 10: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ సంక్షేమ పథకాన్ని వినియోగించుకోవాలని జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ వెంకటేష్ తెలిపారు. కీసర మండల కేంద్రంలో శనివారం పీఎం విశ్వకర్మ సంక్షేమ పథకంపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులవృత్తులకు చేయూతన కల్పించడానికి కేంద్రప్రభుత్వం బ్యాంకు రుణాలు అందజేస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని కులవృత్తుల వారు వినియోగించుకోవాలని కోరారు. ఈ పథకంలో 18 రకాల కులవృత్తుల వారికి చేయూతనందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కీసర ప్రత్యేకాధికారి నందకిశోర్, మహిళలు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్ దరఖాస్తుల పరిశీలన

తాండూరు రూరల్, ఫిబ్రవరి 10: మండలంలోని అంతారం, కరన్‌కోట్, కోటబాస్పల్లి, జినుగుర్తి, గోనూరు, నారాయణపూర్, మల్కాపూర్, సంగెంకలాన్ తదితర గ్రామాల్లో అధికారులు ప్రజాపాలనలో రూ.500లకే గ్యాస్ సిలిండర్ కోసం చేసుకున్న దరఖాస్తులను ప్రత్యేకాధికారులు మరోసారి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు తారాసింగ్, విజయేందర్, రమేష్, ప్రణీత్, రజిత పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: అర్హులైన ప్రతి ఒక్కరికి సబ్సిడి వంటగ్యాస్ అందేవిదంగా మున్సిపల్ అదికారులు పని చేయాలని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. శనివారం ఆమె మున్సిపాలిటీ పరిధిలోని 10, 16వ, వార్డుల్లో గృహలక్ష్మి సబ్సిడీ గ్యాస్ దరఖాస్తూలను మున్సిపల్ అధికారులు పరిశీలించారు. వార్డుల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి వంటగ్యాస్ నెంబరన్లు ఫోన్‌నెంబర్ల వివరాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శశికళ దేవేందర్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: ప్రజాపాలనలో ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఎంపీడీవో, ప్రత్యేకాధికారి శైలజారెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేకాధికారులు శనివారం మనోహరచక్రవర్తి, ప్రణీత్, యంపీవో యాదగిరి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో కలిసి ఆమె ఆరు గ్యారంటీ పథకాలకు అందించిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.